క్లుప్తంగా

పందెంరాయుళ్ల జోరు

నాతవరం : పోలింగ్ ముగియడంతో కాయ్ రాజా కాయ్ అంటూ గ్రామాల్లో పందెం రాయుళ్ల జోరందుకుంది. ఓటర్ల నాడి అధారంగా పందెం రాయుళ్లు విచ్చలవిడిగా పందాలు కాసేస్తున్నారు. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారం చేపడతారని అధిక సంఖ్యలో పందాలు వేసేస్తున్నారు. గతంతో పోల్చుకుంటే నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ కచ్చితంగా గెలుస్తారని, ఆయన మెజార్టీపై పందెం కాస్తున్నారు. ఏది ఎమైనా గ్రామాల్లో ఎక్కడ చూసినా పందెం రాయుళ్ల హడావుడి కన్పిస్తోంది. ఈ ఎన్నికల్లో ఇరుపార్టీలకు చెందిన నాయకులు ఓటర్లకు అధికంగా డబ్బులు పంపిణీ చేశారని ప్రచారం జరుగుతుంది. ఈ నేపథ్యంలో మహిళా ఓటర్లు అధికంగా ఏ పార్టీకి ఓటు వేస్తే ఆ పార్టీ గెలుస్తుందని, అలాగే పార్టీ అభ్యర్థుల మంచి చెడులను బట్టి ఓటింగ్ పడుతుందని అంచనా వేస్తున్నారు.

వంద రోజుల పని కల్పించాలి



మాకవరపాలెంలో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రరావు

మాకవరపాలెం : ఉపాధి కూలీలకు వంద రోజులు పనులు కల్పించాలని ఎంపీడీవో చంద్రరావు ఉపాధి పథకం సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని తామరం, మాకవరపాలెంలో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మస్టర్ షీట్లను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఎంత పనిచేస్తే గిట్టుబాటు కూలీ వస్తుందో కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. పని ప్రదేశాల్లో టెంట్లు, తాగునీరు లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి కూలీకి వంద రోజులు పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

దేవరాపల్లి మండలంలో 86.11 శాతం ఓటింగ్



వెంకటరాజుపురంలో రాత్రి 9 గంటల ప్రాంతంలో బారులు తీరిన ఓటర్లు

దేవరాపల్లి: మండలంలో సోమవారం అర్ధ రాత్రి వరకు సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరిగింది. వెరసి మండలంలో 86.11 శాతం పోలింగ్ నమోదయ్యింది. ఇక్కడ 27 పంచాయతీల పరిధిలోని 57 పోలింగ్ కేంద్రాల్లో 47,015 ఓటర్లకు గాను 40,488 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం 6 గంటల నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. రైవాడ, వెంకటరాజుపురం, బోయిలకింతాడ, ఎ. కొత్తపల్లిలో రాత్రి పది గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. మధ్యాహ్నం మండుటెండను, సాయంత్రం వర్షం కురిసినప్పటికీ ఓటర్లు ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. అధికంగా మహిళలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వృద్ధులు, దివ్యాంగులు సైతం ఓటేశారు. గత సార్వత్రిక ఎన్నికల్లో 80 శాతం మేర పోలింగ్ నమోదు కాగా, ఈ సారి మరో ఆరు శాతం పెరగడం గమనార్హం. పెరిగిన పోలింగ్ శాతం వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉంటుందని ఆ పార్టీ నాయకులు అంచనా వేసుకుంటున్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 1,405 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,290	4,950
మొదటి రకం	4,300	5,000
రెండో రకం	3,770	4,340
మూడో రకం	3,450	3,730

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 38 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బి పాజిటివ్-13 యూనిట్లు, బి నెగిటివ్-1 యూనిట్, ఒ పాజిటివ్-15 యూనిట్లు, ఒ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు, ఏబీ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

ఉత్సాహంగా ఓటేసిన మహిళలు

- పెరిగిన పోలింగ్ శాతం
- మహిళా ఓటింగ్‌తో గెలుపుపై వైఎస్సార్ సీపీలో ధీమా



ఓటు వేసేందుకు క్యూ కట్టిన మహిళలు

నర్సీపట్నం : నియోజకవర్గ ఓటర్లలో చైతన్యం ఉప్పొంగింది. చేతిలోని వజ్రాయుధం సద్వినియోగం చేసుకునేందుకు ఓటర్లు పోటీ పడ్డారు. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో ఉరకలెత్తిన ఉత్సాహంతో ఓటర్లు తమ శక్తిని చాటారు. 2014, 2019 సాధారణ ఎన్నికల్లో ఈ నియోజకవర్గం 82.17 శాతం, 82.33 శాతం పోలింగ్ నమోదు అయింది. మండుటెండలో నిలబడి గంటల తరబడి క్యూలైన్లలో నిలబడి మరీ వృద్ధులు, మహిళలు సైతం ఓట్లు వేయడం విశేషం. ఈ దఫా ఎన్నికల్లో కూడా 84.82 పోలింగ్ శాతం నమోదు అయింది. గతంలో కంటే పోలింగ్ శాతం పెరిగింది.

పెరిగిన మహిళల ఓటింగ్...

ఈ దఫా ఎన్నికల్లో నియోజకవర్గంలోని మొత్తం 2,12,046 మంది ఓటర్లలో 1,79,849 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 92515 మహిళలు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు 87334 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2019 ఎన్నికల్లో 2,10,275 మంది ఓటర్లలో 1,73,117మంది ఓటు వేశారు. మహిళలు 88650 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహిళల ఓట్లతో వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధించింది. మహిళా ఓటింగ్‌తో తమకే లాభమని వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని భావిస్తుంది. వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల్లో డ్వాక్రా రుణాలు మాఫీ, అమ్మ ఒడి, ఏడాదికి రూ.75 వేలు భరోసా, మూడు వేల పింఛను, వంటి సంక్షేమ పథకాలు నూటికి నూరు శాతం అమలు చేయడంతో శ్రీరామరక్షగా నిలుస్తాయని వైఎస్సార్‌సీపీ శ్రేణులు భావిస్తున్నారు. సంక్షేమ పథకాలు అమలుతో నిశ్శబ్దంగా ఫ్యాన్ గుర్తుపై ఓటర్లు ఓటేశారని పార్టీ శ్రేణులు విశ్లేషిస్తున్నారు. మహిళలు ఎక్కువ మంది ఓటింగ్‌లో పాల్గొనడంతో వైఎస్సార్‌సీపీకే లాభిస్తుందని పార్టీ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మంచి చేస్తాడనే నమ్మకంతో మహిళలు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారని వారు భావిస్తున్నారు.

కాయ్ రాజా కాయ్

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందడి ముగియడంతో అసలు ఓటరు తీర్పు ఎటువైపు ఉంటుందా? అన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. తమ పార్టీకే విజయం అంటూ పైకి టీడీపీ శ్రేణులు ఆర్భాటంగా చెబుతున్నా, ఓటరు తీర్పు ఎటువైపు పడిందో అనే ఆందోళనలో ఉన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అనుచరులు మాత్రం విజయం మాదే అనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఎక్కడ చూసినా ఫలితాలపైనే చర్చ జరుగుతోంది. ఓట్ల లెక్కింపునకు 20 రోజుల వ్యవధి ఉండడంతో నియోజకవర్గమంతా చుట్టేసిన వీరు విజయంపై ఓ అంచనాకు వచ్చి పందేలు కాస్తున్నారు. ఎన్నికలకు ముందే చాలా మంది పందేలు కాయగా ఎన్నికల అనంతరం మరింత జోరందుకుంది. ఓట్ల లెక్కింపు దగ్గర పడే వరకు ఆ జోరు మరింత పెరిగే అవకాశం ఉంది.

ఓటింగ్ యంత్రాలతో తప్పని అవస్థలు

నాతవరం : పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎం యంత్రాలు చాలా చోట్ల తరుచూ మొరాయించడంతో ఓటర్లతో పాటు అధికారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండలంలో మొత్తం 65 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఓట్లు వేశారు. వాటిలో గునుపూడి, సరుగుడు, వల్సంపేట, ఏపీపురం, మర్రిపాలెం, నాతవరం, చమ్మచింత గ్రామాల్లో తరుచూ ఓటింగ్ యంత్రాలు సాంకేతిక సమస్య కారణంగా పని చేసేవి కాదు. మరికొన్ని కేంద్రాల్లో వేగంగా పని చేయకుండా నెమ్మదిగా పని చేయడంతో ఓటర్లు గంటల తరబడి క్యూలో నిరీక్షణ చేశారు. దీంతో ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేసేందుకు వచ్చిన వారు తీవ్ర నిరాశకు గురయ్యారు. గునుపూడిలో అయితే ఓటర్లు అధిక సంఖ్యలో క్యూలో ఉండడం, కొందరు వెనుదిరిగి వెళ్లి పోవడం జరిగింది. చాలా పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ యంత్రాలు సరిగ్గా పని చేయడం లేదని పోలింగ్ అధికారులు ఫిర్యాదులు చేసిన సంఘటనలు అనేకం ఉన్నాయి. మర్రిపాలెం గ్రామంలో ఓటింగ్ యంత్రాలు నెమ్మదిగా పని చేయడం వల్ల రాత్రి 7 గంటల వరకు ఓటర్లు క్యూలో ఉండి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాయంత్రం సమయంలో వర్షం పడడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో కొంతసేపు పోలింగ్ నిలిచిపోయింది. చాలా పోలింగ్ కేంద్రాల వద్ద గదుల్లో వెలుతురు తక్కువగా ఉండడంతో ఈవీఎం యంత్రాలపై అభ్యర్థులు గుర్తులు క్లియర్‌గా కన్పించకపోవడంతో ఓటు వేసేందుకు వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడ్డారు.

ఈవీఎంల మొరాయింపు.. ఓటర్ల ఇబ్బందులు



కె.జె.పురంలో పోలింగ్ బూత్ వద్ద క్యూలో ఓటర్లు

మాడుగుల రూరల్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కొన్ని పోలింగ్ బూత్‌ల్లో ఈవీఎంలు మొరాయించడం వల్ల ఓటర్లు ఎక్కువ సేపు క్యూలైన్లలో వేచి ఉండాల్సి వచ్చింది. వి.వి. అగ్రహారం, వంటర్లపాలెం, ఒమ్మలి పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లో కొద్ది సేపు నిరీక్షించాల్సి వచ్చింది. ఈ విషయాన్ని పోలింగ్ ప్రిసైడింగ్ అధికారులు, రూట్, జోనల్ అధికారులకు తెలియజేయడంతో సంబంధిత సిబ్బంది వచ్చి సరిచేశారు. అంతవరకూ ఆయా కేంద్రాల వద్ద క్యూలో ఓటర్లు పెరిగిపోయారు. పోలింగ్ కేంద్రాలు వద్ద ప్రాథమిక చికిత్స కోసం ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఆధ్వర్యంలో వైద్యసేవలందించారు.

సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే గెలుపు

బుచ్చెయ్యపేటలో కార్యకర్తల సమీక్షలో జెడ్పీటీసీ రాంబాబు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ రాంబాబు

బుచ్చెయ్యపేట: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే విజయమని, రెండోసారి ఎమ్మెల్యేగా కరణం ధర్మశ్రీ గెలుస్తారని జెడ్పీటీసీ దొండా రాంబాబు ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం బుచ్చెయ్యపేటలో ఆయన కార్యకర్తలతో సమీక్షించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ చేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ప్రజలు మరలా వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపారన్నారు. సోమవారం జరిగిన పోలింగ్‌కు అన్ని గ్రామాల ప్రజలు ఓటు వేయడానికి తరలివచ్చి తమ పార్టీకి అండగా నిలిచారన్నారు. ఎండను సైతం లెక్క చేయకుండా పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరి ఓపికతో ఓటేసిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటామన్నారు. గతంలో కంటే బుచ్చెయ్యపేట మండలంలో అత్యధికంగా పోలింగ్ నమోదైందన్నారు. ముఖ్యమంత్రి జగనన్న చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరలా అందాలని రెండోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని గద్దె నెక్కించాలని ప్రజలంతా తరలివచ్చి ఓట్లు వేయడంతో పోలింగ్ శాతం పెరిగిందన్నారు. 35 గ్రామ పంచాయతీల్లోని 63 పోలింగ్ కేంద్రాల్లో జరిగిన ఓటింగ్ శాతంపై కార్యకర్తలతో సమీక్షించారు. మండల సచివాలయ కన్వీనర్ కోరుకొండ అప్పలనాయుడు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, వైస్ ఎంపీపీ గొంపా చినబాబు, కోఆపరేటివ్ పర్సన్ ఇన్‌చార్జి సుంకరి శ్రీను, నమ్మి అప్పలరాజు, జోగా కొండబాబు, సుంకరి గాంధీ, పెదిరెడ్ల మాణిక్యం, మరిసా నాని, అమ్మునాయుడు, తమరాన శ్రీను, సత్తిబాబు, గుడాల ఆనంద్, గోపిశెట్టి శ్రీను, గుద్దేటి శ్రీను, బోయిన నారాయణమూర్తి, పోలినాయుడు పాల్గొన్నారు.

పూతదశలో బరబాటి సాగు



రామచంద్రపురంలో బరబాటి పంట

కె.కోటపాడు: మండలంలోని మెట్ట ప్రాంత గ్రామాల్లో బరబాటి సాగు ఆశాజనకంగా ఉంది. మూడు నెలల కాలంలో చేతికందివచ్చే పంట కావడంతో బరబాటిని రైతులు అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. తక్కువ పెట్టుబడితో సాగవుతున్న బరబాటి పంట ప్రస్తుతం పూతదశలో ఉంది. నీటి లభ్యత ఉన్న పొలాల వద్ద కింతాడ, జోగన్నపాలెం, రామచంద్రపురం, మర్రివలస, లంకవానిపాలెం, పింద్రంగి, కె.సంతపాలెం, ఆర్లి, ఎరకన్నపాలెం, దాలివలస, కె.సంతపాలెం గ్రామాల్లో 40 ఎకరాలలో సాగు చేస్తున్నారు.

ఘనంగా పరదేశమ్మ పండగ

రోలుగుంట: కోమరవోలులో పరదేశమ్మ పండగను గ్రామస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకూ పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం గ్రామంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆకాశం మిరుమిట్లు గొలిపేలా బాణసంచా కాల్చారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కోలాహలం



పోలింగ్ వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఉమాశంకర్ గణేష్



నాయకులతో ఆనందాన్ని పంచుకుంటున్న ఎమ్మెల్యే గణేష్

నాయకులతో పోలింగ్ నమోదుపై చర్చించిన ఎమ్మెల్యే

నర్సీపట్నం : వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సందడి వాతావరణం నెలకొంది. సార్వత్రిక ఎన్నికకు సంబంధించి నిర్వహించిన పోలింగ్‌లో వైఎస్సార్‌సీపీకి అనుకూలపవనాలు వీయడంతో మంగళవారం నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యాలయానికి చేరుకుని ఎమ్మెల్యే అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్‌కు అభినందనలు తెలిపారు. పోలింగ్ సరళిని బట్టి చూస్తే విజయాన్ని సొంతం చేసుకుంటున్నామని నాయకులు, కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలి రావడంతో పార్టీ కార్యాలయంలో కోలాహలం నెలకొంది. ఎమ్మెల్యే గణేష్ మండల పార్టీ అధ్యక్షుడు, బూత్ కమిటీ కన్వీనర్లతో పోలింగ్ బూత్‌ల వారిగా మెజార్టీ ఎంత వస్తుందనే దానిపై పోలింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే గణేష్ విజయం సాధించడం ఖాయమని నాయకులు, కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

చోడవరం నియోజకవర్గంలో 84.44 శాతం పోలింగ్

గత ఎన్నికల కంటే పెరిగిన పోలింగ్ శాతం



గోవాడ కేంద్రంలో పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

చోడవరం: గత ఎన్నికలతో పోలిస్తే చోడవరం నియోజకవర్గంలో ఈసారి పోలింగ్ శాతం కొంత మేర పెరిగింది. పురుషుల కంటే మహిళలు ఎక్కువ మంది ఓట్లు వేయడం అధికార వైఎస్సార్‌సీపీకి కలిసొచ్చే అంశంగా కనిపిస్తోంది. 2019 ఎన్నికల్లో 84.26 శాతం మంది ఓట్లు వేయగా, ఈ సారి ఎన్నికల్లో 84.44 శాతం పోలింగ్ పెరిగింది. మొత్తం 2,17,484 మంది ఓటర్లు ఉండగా, 1,83,643 మంది ఓట్లు వేశారు. వీరిలో పురుషులు 89,908 మంది, మహిళలు 94,733 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. 2019లో మొత్తం ఓట్లు 2,10,313 కాగా, వీరిలో పురుషులు 1,02,494, మహిళలు 1,07,806 ఉన్నారు. అప్పట్లో మొత్తం పోలైన ఓట్లు 1,77,219 కాగా, వీరిలో పురుషులు 85,879, మహిళలు 91,339 మంది ఓటు వేశారు. గత ఎన్నికల్లో కంటే ఈ సారి 4,127 మంది కొత్తగా ఓటర్లు చేరారు. ఈ పెరుగుదలతోపాటు పలుచోట్ల సాంకేతిక సమస్యలతో రాత్రి 8 గంటల దాటి కూడా లక్ష్మీపురం, గంధవరం, గోవాడ, జె.నాయుడు, కిత్తంపేట, మల్లాం, జన్నవరం, చినపాచిలి, ముద్దుర్తి కేంద్రాల్లో పోలింగ్ జరిగింది. రావికమతం మండలంలో బూత్ నంబరు- 3లో అర్ధరాత్రి 11.30 గంటల వరకూ పోలింగ్ జరిగింది. అప్పటి వరకూ ఓటర్లు క్యూలైన్లలో బారులు తీరడంతో పోలింగ్ శాతం పెరిగింది.

రావికమతం మండలంలో పెరిగిన ఓటింగ్



రావికమతంలో రాత్రి 10 గంటల వరకూ క్యూలైన్‌లో ఓటర్లు

రావికమతం: మండలంలో ఈ ఏడాది పోలింగ్ శాతం అధికంగా పెరిగింది. మొత్తం 83.38 శాతం నమోదైందని మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమణారావు తెలిపారు. గత ఎన్నికల్లో 80.30 శాతం నమోదు కాగా, ఈ ఏడాది 3 శాతం పెరిగిందన్నారు. మండలంలో ప్రస్తుతం 55,709 మంది ఓటర్లు ఉండగా, 46,367 మంది ఓటు వేశారన్నారు. 28 పంచాయతీల్లో 61 పోలింగ్ బూత్‌లు ఉండగా, వీటిని ఆరు క్లస్టర్లుగా విభజించామన్నారు. మొదటి క్లస్టర్‌లో 11,403 ఓటర్లకు గానూ 8,952 ఓట్లు పోలయ్యాయని తెలిపారు. 2వ క్లస్టర్‌లో 10,093కు 8,683 ఓట్లు, మూడో క్లస్టర్‌లో 9,093కు 7,010 ఓట్లు, నాల్గో క్లస్టర్‌లో 10,483 ఓట్లకు 9,168 ఓట్లు, ఐదో క్లస్టర్‌లో 9,777 ఓట్లకు 8,435 ఓట్లు, ఆరో క్లస్టర్‌లో 4,860 ఓట్లకు 4,119 ఓట్లు పోలయ్యాయన్నారు. రావికమతం, మేడివాడ, చినపాచిల, మత్స్యవానిపాలెం, కొత్తకోట, తట్టబంద తదితర 11 గ్రామాల్లో సోమవారం రాత్రి 9 గంటల వరకూ పోలింగ్ కొనసాగిందన్నారు. అయినప్పటికీ పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందన్నారు.

ప్రతిభ చూపిన టెన్త్ విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను సత్కరించిన పెతకంశెట్టి శివసత్యనారాయణ జోసెఫ్

అనకాపల్లి: విద్యార్థి దశనుంచి ఉన్నత శిఖరాలను చేరుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ డిస్ట్రిబ్యూషన్ అసోసియేషన్ అధ్యక్షుడు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి శివసత్యనారాయణ జోసెఫ్ అన్నారు. ఈ ఏడాది పదోతరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపిన వారికి స్థానిక వైఎంవీఏ హాల్లో మంగళవారం రాత్రి సత్కరించారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన కరణం సంజన(588), ఎం.వరుణ్ సందీప్(587), కె.జె.రాజ్(586)లను నగదు ప్రోత్సాహం, దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సొంత నిధులతో విద్యా, వైద్య రంగాల్లో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. పదో తరగతి ఫలితాలు విడుదలైన వెంటనే ఈ కార్యక్రమం నిర్వహించాలనుకున్నప్పటికీ సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వాయిదా వేసినట్టు తెలిపారు. ఎన్నికల అయిన తరువాత సత్కరించినట్టు చెప్పారు. హైస్కూళ్లకు వెళ్లి ఉత్తమమార్కులు సాధించిన విద్యార్థులను ఆగస్టు 15 వ తేదీ లోపు సత్కరించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ బాలికోన్నత పాఠశాల తెలుగు పండితురాలు వి.ఆర్.రాజేశ్వరిదేవి, సీనియర్ ఉపాధ్యాయులు మారిశెట్టి వెంకటఅప్పారావు, అసోసియేషన్ ప్రతినిధులు వెలగా కాశీపతి, కుంచం నూకయ్యశెట్టి, వినకోట బుచ్చిరాజు, పూసర్ల నర్సింగరావు, పెతకంశెట్టి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి



నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎన్నికల పరిశీలకుడు ప్రభాకర్

అనకాపల్లి: న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.జె.వి.ఎస్.కుమార్ తెలిపారు. అనకాపల్లి బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులతో మంగళవారం ఎన్నికల పరిశీలకుడు ప్రభాకర్ ప్రమాణస్వీకారం చేయించారు. అధ్యక్షుడు ఎం.జె.వి.ఎస్.కుమార్, కార్యదర్శి దుర్గారావు, కోశాధికారి సందీప్, ఉపాధ్యక్షుడు రోజా, సహాయ కార్యదర్శి తులసి, స్పోర్ట్స్ కార్యదర్శి మోహన్, లైబ్రేరియన్ ప్రతినిధి జగపతి, మహిళా ప్రతినిధి కుసుమతో పాటు మరో ఐదుగురు ఎగ్జిక్యూటివ్ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ కోర్టు కొత్త భవనం నిర్మాణ కోసం సీనియర్ లాయర్లను అందరినీ సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకుంటానని చెప్పారు.

మాడుగులలో 86.02 శాతం పోలింగ్

గెలుపోటముల్లో మహిళల ఓట్లు కీలకం

మాడుగుల రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో మాడుగుల నియోజకవర్గంలో 86.02 శాతం మేర పోలింగ్ జరిగింది. మొత్తం 1,88,989 ఓటర్లకు గాను 1,62,577 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో 92,102 మంది పురుషులకుగాను 78,914 మంది ఓటు వేశారు. 96,886 మంది మహిళలకు గాను 83,663 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషుల కంటే 5,012 మంది మహిళలు ఎక్కువగా ఓటు వేశారు. వీరిలో ఎక్కువగా స్వయం సహాయక సంఘాల సభ్యుల ఓట్లు ఉండటంతో ఇవే అధికార పార్టీ గెలుపునకు కీలకం కానున్నాయని అంచనా వేస్తున్నారు. 2019 సంవత్సరం ఎన్నికల్లో మొత్తం 1,85,791 మంది ఓటర్లకు గాను, 1,55,306 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. గత ఎన్నికల కంటే 3,198 మంది ఓటర్ల సంఖ్య ఈ ఏడాది పెరిగింది. పెరిగిన ఓటర్లలో మహిళలు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ విజయానికి ఈ ఓటర్లు కీలకం కానున్నారు.

గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి పోటీ చేసిన సిట్టింగ్ ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు 15,809 ఓట్ల మెజార్టీతో టీడీపీ అభ్యర్థి గవిరెడ్డి రామానాయుడుపై గెలిపొందారు. ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల్లో మహిళా ఓట్లు గెలుపోటముల్లో కీలకం కానుండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

నేడు గౌరీపరమేశ్వరుల ఆలయ వార్షికోత్సవం



గౌరీపరమేశ్వరుల అమ్మవారు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ ప్రతినిధి గరికి వెంకటరావు, మద్దాల కూర్మారావు మంగళవారం తెలిపారు. మెయిన్‌రోడ్డు రహదారి విస్తరణలో సుమారుగా 15 సంవత్సరాల క్రితం అమ్మవారి ఆలయాన్ని తొలగించారని, ఆలయ వెనుకభాగాన ఉన్న స్థలం వ్యక్తి సాయంతో అమ్మవారి గర్భగుడిని మూడు సంవత్సరాల పునఃనిర్మించినట్టు చెప్పారు. ఈ ఆలయానికి సుమారు 170 సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం 6 గంటల నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం సుమారుగా 10వేల మందికి అన్నసమారాధన నిర్వహించనున్నట్టు చెప్పారు. సాయంత్రం 6 గంటలకు గౌరీపరమేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని ప్రధాన అర్చకులు రేజేటి అప్పలచార్యులు(చక్రవర్తి)వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. కల్యాణంలో పాల్గొనే దంపతులు కమిటీవారిని సంప్రదించి పేర్ల నమోదు చేసుకోవాలన్నారు.

ఫలితాలు వచ్చేంతవరకు అమలులో కోడ్

మునగపాక: సార్వత్రిక ఎన్నికలు పూర్తయినా ఫలితాలు వచ్చేంత వరకూ కోడ్ అమలులో ఉంటుందని ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎక్కడైనా రాజకీయ గొడవలకు దిగితే కేసులు తప్పవన్నారు. అలాగే 144వ సెక్షన్ కూడా అమలవుతుందన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చేంతవరకు ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలన్నారు.శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు.

చౌడువాడలో వైభవంగా చినపైడితల్లమ్మ పండగ



చెక్క గుర్రాల ఊరేగింపులో గ్రామస్తులు

కె.కోటపాడు: చౌడువాడలో చిన పైడితల్లమ్మ పండగ మంగళవారం ఘనంగా జరిగింది. ఇక్కడ అమ్మవారి పండగ పర్వదినం కావడంతో ఉదయం నుంచే పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పండగలో భాగంగా సాయంత్రం చెక్క గుర్రాలను గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. బంధువులు, స్నేహితుల రాకతో గ్రామమంతా సందడి వాతావరణం నెలకొంది.